క్లుప్తంగా

బంకుల తొలగింపు

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బంకులను మంగళవారం గుత్తి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ డీఎం గంగాధర్ ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసుల సహకారంతో ఆయన దగ్గరుండి జేసీబీతో వాటిని తీయించివేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ఆర్టీసీ పోలీసులు గిరి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్ నుంచి పోర్టర్స్ లైన్ వరకూ రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు తీగలను లాగి గృహాలు, దుకాణాలకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈ రఘునాథ్‌ను సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి తదితరులు విద్యుత్ నిలయంలో ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే రోడ్డుకు అడ్డంగా, ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని, విద్యుత్ కోతలను ఎత్తివేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.కె.బాషా, రఘు, సురేంద్ర, రాము, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి హెచ్చరించారు. మంగళవారం దంతలపల్లి, శింగవరం, నీర్జాంపల్లి, కొట్టాల గ్రామాల్లో పర్యటించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల్లో భాగంగా మట్కా, పేకాటను కొనసాగిస్తే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు దాణా పంపిణీ

పామిడి: పట్టణంలోని పశువైద్యశాలలో మంగళవారం పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ఉషా కిరణ్ సారథ్యంలో 50 శాతం సబ్సిడీతో పాడి రైతులకు పశుదాణా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, పాడిరైతులు, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి



గుత్తి ఆర్‌ఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. గుత్తి ఆర్‌ఎస్ పత్తికొండ రోడ్డు కూడలిలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట మంగళవారం వారు నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌ఎస్‌లో భారీలో ర్యాలీ నిర్వహించి రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కేఎం.రంగనాయకులు, జీఎం.బాషా, భీమలింగ, సామాజిక సేవా కార్యకర్తలు గద్దల మస్తానప్ప, గద్దల నాగరాజు మాట్లాడుతూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు గద్దల జయమ్మ, మాజీ ఎంపీటీసీ అంజలి, స్టోర్ డీలర్ మస్తాన్, దళిత సంఘాల నాయకులు మందల నాగరాజు, అరుణ్, చిన్న, ఆదినారాయణ, తిరుపాలు, దనపాల్, బీసీ సంఘం నాయకులు కల్లుపెంటశీనా, ప్రసాద్, ఆర్డీటీ పాఠశాల ఉపాధ్యాయులు అంజలి, రంగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ఆర్డీటీని సంరక్షించుకుందామని మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, దళిత సంఘం నాయకుడు ఆనంద్ అన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో నార్పల క్రాసింగ్ వద్ద ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల లో బుధవారం వీరబ్రహ్మేం ద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం 6:15కి స్వామి కల్యాణం,ఆరాధన, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఆటలకు వేళాయె

- వేసవి శిక్షణా శిబిరాలతో చిన్నారుల నైపుణ్యానికి పదును
- సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



తాడిపత్రి పట్టణంలో పిల్లలకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

తాడిపత్రిటౌన్: పిల్లలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో పట్టణంలో వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థుల క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలకు పదును పెడుతున్నాయి. పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృథా చేసుకోకుండా తమకు నచ్చిన క్రీడల్లో, సాంస్కృతిక అంశాల్లో నైపుణ్యతను సాధిస్తూ తమ మేధోశక్తికి పదును పెడుతున్నారు. ఇప్పటికే పలు రంగాల్లో తాడిపత్రి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలువురితో శభాష్ అనిపించుకుంటున్నారు. తాడిపత్రిలో పట్టణంలో పలు కాలనీల్లో వేసవి శిక్షణా శిబిరాలు విరివిగా ప్రారంభమయ్యాయి. సాంస్కృతిక అంశాలైన సాంప్రదాయ నృత్యాలు, వెస్ట్రన్ డ్యాన్స్‌లు, యోగా, చేతిరాత మెరుగు శిక్షణతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులు పట్టు సాధించాడానికి వేసవి శిబిరాలకు పరుగులు పెడుతున్నారు. అలాగే క్రీడలపై ఆసక్తి చూపుతున్న విద్యార్థుల కోసం పెన్నా పరివాహక పలు ప్రాంతాలు, పాఠశాల క్రీడా ప్రాంగణాలు వేదికలవుతున్నాయి. విద్యార్థులు క్రికెట్, కబడ్డీ, బ్యాట్‌మింటన్, టేబుల్ టెన్నిస్, కరాటే, స్కేటింగ్ నేర్చుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. క్రీడలు... సాంస్కృతిక అంశాలలో విద్యార్థులు ప్రతిభ చూపుతుండటంతో తల్లిదండ్రుల్లో కూడా సంతోషం నింపుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు క్రికెట్, కబడీ, కరాటేలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకున్నారు. గత ఏడాది తాడిపత్రి పట్టణానికి చెందిన వందనా డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు కేధార్‌నాథ్, బద్రీనాథ్‌లలో –2 డిగ్రీల ఉష్ణోగ్రతలో దాదాపు గంటన్నర పాటు కూచిపూడి నృత్యం చేసి వరల్డ్ గిన్నీస్ బుక్ రికార్డు సాధించి పలువురి ప్రముఖులతో అభినందనలు అందుకున్నారు. తాజాగా రాష్ట్రస్థాయి బీచ్ కబడీ పోటీల్లో తాడిపత్రి క్రీడాకారులు గౌతమి, సుహానా అత్యంత ప్రతిభ కనబరిచి పలువురి మన్ననలు పొందారు.



కేదార్‌నాథ్ ఆలయం వద్ద నృత్య ప్రదర్శనలో పాల్గొన్న తాడిపత్రి విద్యార్థినులు (ఫైల్)

క్రికెట్ నేర్చుకుంటున్నా



నాకు క్రికెట్ అంటే ఇష్టం. వేసవి సెలవులు కావడంతో నేను రోజు క్రికెట్ నేర్చుకోవడానికి పట్టణంలోని ఒక శిక్షణ శిబిరానికి వెళ్తున్నాను. క్రికెట్ ఆడటం నాకు చాలా ఇష్టం. క్రికెట్‌లో దేశం తరపున ఆడాలన్నదే లక్ష్యం.
చక్రనాథ్, ఆరోతరగతి, తాడిపత్రి

కుట్టు మిషన్ల పంపిణీలో అవినీతి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలకు అందించిన కుట్టు మిషన్ల పంపిణీలో భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిపై విచారణ జరపాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి రూ.230 కోట్లతో టెండర్ పిలిచారని, అయితే కేవలం రూ.73 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన రూ.157 కోట్లు ఎవరి జేబులోకి వెళ్లాయో కూటమి ప్రభుత్వం చెప్పాలన్నారు. బీసీ మహిళల అభ్యున్నతికి పాల్పడాల్సిన కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీలో ఇంత భారీగా అవినీతికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. బీసీ మహిళలకు పూర్తి స్థాయిలో కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లలితకు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురుప్రసాద్‌యాదవ్, సీపీ రంగారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రంగస్వామి, రాముయాదవ్, రమేష్‌రెడ్డి, కిరణ్‌బాబు, బ్రహ్మకుమార్, హరిబాబు, రాజేష్, పవన్, అబ్దుల్, షఫీ, నాగేంద్రబాబు, ప్రసాద్, గోపిరెడ్డి, మురళి, పాలేటి మధుసూదన్‌రెడ్డి, రౌఫ్, రంగస్వామి, అరటిపండ్ల చంద్ర, మహమ్మద్, వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, మహిళ నాయకురాళ్లు హేమలత రెడ్డి, లావణ్య, భాగ్య, కౌన్సిలర్లు మర్తాడు హసీనా, రూతమ్మ, వాల్మీకి శివ, వరదరాజులు, కె.వి.రమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల్లో అర్హులకు అన్యాయం



మాట్లాడుతున్న లింగమయ్య

గుంతకల్లు: బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య ఆరోపించారు. మంగళవారం చేతి వృత్తిదారుల మండల సమావేశాన్ని స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తిదారుల పట్ల దారుణంగా వ్యవహరిస్తుందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు రుణాలు ఇస్తామని దారుణంగా మోసం చేశారన్నారు. కూటమ నాయకులకు మాత్రమే రుణ యూనిట్లు కేటాయించారన్నారు. అర్హులైన బీసీలకు రుణాలు కేటాయించపోతే ప్రభుత్వం కాలగర్భంతో కలసిపోక తప్పదన్నారు. అనంతరం చేతి వృత్తిదారుల గుంతకల్లు మండల సమాఖ్య కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాము, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, గురుస్వామి, వర్కింగ్ ప్రెసెండింట్‌గా ఆదినారాయణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు.

నేటి నుంచి బండి శూల తిరునాల



బండి శూల రథోత్సవం (ఫైల్)



మాట్లాడుతున్న పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో బుధవారం నుంచి ఆదివారం వరకూ వరుసగా ఐదు రోజులపాటు శుడిబండి(బండిశుల) తిరునాల నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరునాల రోజు బండికి తాటిచెట్టు కాండాన్ని నిటారుగా తాళ్లతో కట్టి నిలబెడతారు. ఆ కాండం చివరి భాగాన బెలూన్లతోనూ, పూలదండలతో అలంకరించి దాన్ని రథంగా భావిస్తారు. తాటి కాండం కిందకు ఒరగకుండా దానిపై ప్రజలు ఎక్కి కూర్చొని ఉంటారు. తిరునాల ప్రారంభం రోజు ఈ రథాన్ని రామరాజుపల్లి ఎద్దులు, చుట్టుప్రక్కల గ్రామాల ఎద్దులతో కాశేపల్లి మీదుగా గుత్తి అనంతపురం గ్రామం వైపు లాగిస్తారు. ఆ సమయంలో ఈ రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య దేవతా విగ్రహాలను చిలకమ్మ పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. బుధవారం రాత్రికి ఆ గ్రామం చేరగానే గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. గురువారం రాత్రికి రామరాజుపల్లికి చేరుతుంది. తిరిగి శుక్రవారం రాత్రికి బయలుదేరి శనివారం గుత్తి అనంతపురానికి చేరుతుంది. ఆ రోజు రాత్రి అక్కడ నుంచి బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున రామరాజుపల్లికి చేరడంతో తిరునాల ముగుస్తుంది. ముగింపురోజు గ్రామంలో మొక్కుబడుల చెల్లింపులో భాగంగా గ్రామస్తులు దేవర చేస్తారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులకు ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. దేవర కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ముఖ్య పట్టణాలను నుంచి సైతం భక్తులు రావడం విశేషం. గ్రామంలోని ప్రజలు అధికంగా ముత్యాలయ్య, సుంకులమ్మ పేర్లను కలిగి ఉండడం ఆ దేవతలపై వారికున్న భక్తి ప్రపత్తులకు నిదర్శనంగా నిలుస్తోంది.

శాంతియుతంగా నిర్వహించాలి

పెద్దవడుగూరు: బండిశూల తిరునాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ ఉషారాణి, సీఐ రామసుబ్బయ్య సూచించారు. మంగళవారం గుత్తి అనంతపురం, కాశేపల్లి , పామిడి మండలం రామరాజువల్లి గ్రామాల పెద్దలతో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ప్రారంభమయ్యే తిరునాలలో గ్రామస్తులు వారి కట్టుబాట్ల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకరావాలరన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, డాక్టర్ శ్రీనివాసబాబు, ట్రాన్స్ ఏఈ లు షఫీ, మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. హామీ నెరవేర్చండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: రాగులపాడు నుంచి పిల్లకాలవలు ఏర్పాటు చేసి గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా నీరును అందిస్తానని సీఎం (చంద్రబాబు) పుట్టిన రోజు సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9వ తేదీ ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయపురం వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను పరిశీలించడానికి వస్తున్న నేపథ్యంలో 2017లో పామిడి పర్యటనలో చంద్రబాబు గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు తన పుట్టిన రోజు సందర్భంగా ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రాగులపాడు నుంచి పిల్లకాలవలు ఏర్పాటు చేసి గుంతకల్లు నియోజవర్గంలోని చెరువులకు సాగునీరు ఇవ్వడానికి కావాల్సిన నిధులు కేటాయించడంతోపాటు ఉత్తర్వులను విడుదల చేయాలన్నారు. హంద్రీనీవా కాలవ వెడల్పు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని దాదాపు 3.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా డిస్ట్రిబ్యూటర్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ శాంతిభద్రతలపై చూపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రామాంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



గుంతకల్లులో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/పామిడి: క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా భూసార పరీక్షల కేంద్రం వ్యవసాయ అధికారి శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం గుంతకల్లులోని మార్కెట్ యార్డులో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ, రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా సహకారం సంఘం అధికారి శ్రీనివాస్, జిల్లా భూసార పరీక్షల అధికారి శేఖర్‌రెడ్డి, ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు మండలానికి ఇప్పటికే 835 పరీక్షలను టార్గెట్‌గా ఇచ్చామన్నారు. సీజన్ ప్రారంభకాలంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమిలో ఎటువంటి పోషకలోపాలు ఉన్నాయి? ఎటువంటి పంటలకు భూమి అనుకూలంగా ఉంటుంది అన్న విషయాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి మండలం పీ కొత్తపల్లి పీఏసీఎస్ పరిధిలోని పీ కొత్తపల్లిలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ డీ లీనా వసుంధర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి భూసార పరీక్షా కేంద్రం టెక్నికల్ ఏఓ శేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావ్, ఎంపీఈఓ రామాంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు పేద పిల్లల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ–1 కాశెప్ప మంగళవారం తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించామన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత, ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ, బీసీ, ఓసీల పిల్లలు అర్హులన్నారు. అర్హులైన వారు ఈ నెల 15లోగా గ్రామ/వార్డు సచివాలయాల్లో లేదా ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెద్దవడుగూరు: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని భీమునిపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభ లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, పీఆర్ ఇంజినీర్ వరప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

తాడిపత్రి: మండలంలోని జంబులపాడు గ్రామంలో ఈ నెల 12న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు ఎ. మురళీక్రిష్ణ మంగళవారం తెలిపారు. 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ స్వామి వారి కళ్యాణోత్సవ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 12న సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే శ్రీదేవి, భూదేవి, సమేత లక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి పెద్దఎత్తున భక్తులు హాజరు కావాలన్నారు.

రక్త నమూనాల సేకరణ

యల్లనూరు: మండల కేంద్రంలో ఫైలేరియా వ్యాధిపై మంగళవారం రాత్రి రక్త నమూనాలను సేకరించినట్లు వైద్యుడు లోకేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి రామకృష్ణ, సీహెచ్ఓ మధు కుమార్, సూపర్‌వైజర్ జయినాబీ, ల్యాబ్ టెక్నీషియన్ శివప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న డీసీహెచ్ఓ, అభయ ఫౌండేషన్ సభ్యులు

శింగనమల: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని డీసీహెచ్ఓ కేపీ పాల్ కుమార్ సూచించారు. శింగనమల సీహెచ్‌సీలో అభయ ఫౌండేషన్ రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్, రోగులు కూర్చోవడానికీ బెంచీలు, రెండు వీల్ చైర్‌లు, రోగులు భోజనం చేయడానికి చైర్లు వితరణ చేసింది. మంగళవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఓ మాట్లాడుతూ సీహెచ్‌సీలో వైద్యులు కొరత లేకుండా చేస్తామన్నారు. 24 గంటలు ప్రజలకు సేవలు అందజేస్తామన్నారు. అభయ ఫౌండేషన్ సభ్యుడు బాలచంద్రస్వామి, వైద్యుడు రోహినాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో 9న మామిడి తోట వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా ఓపెన్ ఎయిర్ జైల్లో ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు మామిడి తోటకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ కాంతారాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3,544 మామిడి చెట్లకు కాసిన కాయలకు కడప రేంజ్ ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు.

9కి వేలం వాయిదా

బుక్కరాయసముద్రం: మండలంలోని అనంతపురం జిల్లా జైల్లో ఈ నెల 8న జరగాల్సిన వేలం 9వ తేదీ మధ్యాహ్నానికి వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25 వేల కిలోల వేరు శెనగ చెక్కకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

'ఉపాధి పనులు కల్పించండి'

శింగనమల: ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. శింగనమల మండలంలోని రాచేపల్లిలో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, సీహెచ్ఓ మోహన్‌బాబు, శ్రీధర్ బాబు, కేశవయ్య, శ్రీదేవి, రాజేంద్ర, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

యాడికి: ఇళ్ల వద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్ఓ జుబేదా, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి

యాడికి: గ్రామాల్లోని తడి,పొడి చెత్తను రోజూ పంచాయతీ కార్మికుల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని ఈఓపీఆర్డీ శశికళ సూచించారు. మంగళవారం మండలంలోని తూట్రాళ్లపల్లిలో ఈఓపీఆర్డీ శశికళ పర్యటించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

గుంతకల్లు/పామిడి/గుత్తిరూరల్: గుంతకల్లు పట్టణంలోని స్వీపర్‌కాలనీలో బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసంపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత, రుతుక్రమ వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. అలాగే పామిడి పట్టణంలోని సంతమార్కెట్, మంజు టాకీస్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల అంగన్‌వాడీ కేంద్రాల్లో గుత్తి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా గుత్తి పట్టణంలోని దాసరి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్



జంక్షన్ పాయింట్‌లో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. గతంలో ఇక్కడ **వాహనాలను పార్కింగ్ చేయరాదన్న బోర్డును** మునిసిపల్, పోలీసులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ బోర్డు కనిపించడం లేదు. జంక్షన్ పాయింట్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం చుట్టపుచూపుగా పోలీసులను డ్యూటీలు వేస్తున్నారేకానీ కంటిన్యూగా వేయకపోవడంతో వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు.

పొంచి ఉన్న ప్రమాదం



పాతపల్లి వద్ద ప్రమాదకరంగా గుంత

యల్లనూరు: యల్లనూరు నుంచి సింహాద్రిపురం వెళ్లే ప్రధాన రహదారిపై పాతపల్లి గ్రామ సమీపాన పెద్ద గుంత ఉంది. ఈ గుంత వద్ద రోడ్డు ధ్వంసమైంది. దీంతో రోడ్డు దెబ్బతిన్న స్థలం వద్ద బ్యారికెడ్లు కట్టారే తప్ప రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. నిత్యం ఈ గుంత వద్ద ప్రమాదాలు జరిగి చాలా మంది వాహనదారులు క్షతగాత్రులయ్యారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఎయిడెడ్‌స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హౌసింగ్‌బోర్డులోని వివేకానంద పంచపల్లవ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1991–2000లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ప్రభాకర్, ఇన్నయ్య, చంద్రకళ, ఆరోగ్యమేరీ, మాణిక్యమ్మ, లూర్దుమేరీని పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.